

# క్యూబింగ్ సెలెబ్రిటీలు

ప్రముఖ బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ ఓ విలేకరుల సమావేశానికి హాజరై ఒకే ఒక్క నిమిషంలో రూబిక్స్ క్యూబ్ పజిల్‌ను పూర్తిచేసి అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేశాడు. మరో సందర్భంలో భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ అమీర్‌తో ఒక చాట్ షోకు హాజరయ్యాడు. అప్పుడు కోహ్లీ తనకు అమీర్ దగ్గర క్యూబ్ పరిష్కరించే విధానం గురించి నేర్చుకోవాలని ఉందని పేర్కొనడం విశేషం. బ్రెజిల్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు ఆటగాడు ఫిలిప్ లూయిస్ ఒక స్పానిష్ టాక్ షోలో మాట్లాడుతూ సునాయాసంగా పజిల్‌ను పరిష్కరించాడు. గార్డియన్స్ ఆఫ్ ద గెలాక్సీ చిత్ర నటుడు తన సినిమాకు సంబంధించిన ఇంటర్వ్యూ ఇస్తూ కేవలం 3 నిమిషాల్లోనే ఈ పజిల్ పూర్తిచేశాడు. తర్వాత 2020లో దాన్ని ఒకే ఒక నిమిషంలో పరిష్కరించి ఇన్‌స్టాగ్రామ్ లో దానికి సంబంధించిన వీడియోను జత చేశాడు. అంతేకాదు రూబిక్స్ క్యూబ్‌ను పది సెకండ్లలోపే పూర్తి చేయగలిగిన చిన్నారులు తన హీరోలని ఆయన ప్రకటించాడు.



అందరికీ బాగా పరిచయం అయిన చిత్రం 'పర్స్యూట్ ఆఫ్ హ్యాపీనెస్' చిత్రంలో క్రిస్ గార్డెనర్ పాత్రధారి విల్ స్మిత్ రూబిక్ క్యూబ్‌ను వేగంగా పరిష్కరించటం ద్వారా ఉద్యోగం సంపాదిస్తాడు. ఒక లైవ్ టెలివిజన్ ఈవెంట్‌లో స్మిత్‌ను ఇదెలా సాధ్యమో చేసి చూపించమని ఎవరో సవాలు విసిరితే ఒక్క నిమిషం కంటే తక్కువ సమయంలో దాన్ని పరిష్కరించి 'భేష్' అనిపించుకున్నాడు. ఐదుసార్లు ఎన్బీఏ చాంపియన్ అయిన మైఖేల్ జోర్డాన్ మాజీ సహచరుడు సెవె కెర్రె 2017లో విలేకరుల సమావేశానికి క్యూబ్‌తో వచ్చి వాళ్లు అడిగే ఇబ్బందికర ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఆటలో మునిగిపోయాడు. అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి డబ్ల్యూ బుష్ ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఒక ఎగ్జిబిషన్‌కు హాజరై క్యూబ్‌ను పరిష్కరించటానికి ప్రయత్నించాడు. బిగ్ బాయ్స్ టీవీ షోలో లాజిక్ అనే గాయకుడు రాప్ షోను, క్యూబ్‌ను కలిపి ప్రదర్శన ఇచ్చాడు. అలాగే డీస్టార్మ్ పవర్ కూడా ఈ రెండిటిని కలిపి ప్రదర్శన ఇచ్చాడు.

## క్యూబ్‌లతో చిత్రాలు

అద్వైత్ మనాజీ, కేరళలోని కొచ్చికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి. రూబిక్స్ క్యూబ్‌లతో చిత్రాలను రూపొందిస్తుంటాడు. అతను దాదాపు 300 క్యూబ్‌లను ఉపయోగించి రజనీకాంత్ చిత్రాన్ని రూపొందించాడు. దాన్ని సూపర్‌స్టార్‌కు బహుమతిగా ఇచ్చాడు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారి రజనీ అభిమానులను అలరించింది. అలాగే ప్రణవ్ ఓంకార్ అనే నాలుగేళ్ల పిల్లవాడు క్యూబ్స్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ భార్య నీతా అంబానీ బొమ్మను తయారుచేసి ఆమెకు పుట్టినరోజు కానుకగా ఇచ్చాడు.





## సూపర్ కిడ్ దివిష

రూబిక్స్ క్యూబ్‌ను ఐదు నిమిషాల్లో పరిష్కరించి దివిష భన్సాలీ రికార్డు సాధించింది. మూడేండ్ల దివిష ఢిల్లీలోని వివేక్ విహార్‌లో నివాసం ఉంటుంది. అలాగే క్యూబ్ పరిష్కరించిన అతి చిన్నవ్యక్తిగా రికార్డు కూడా ఈ చిన్నారి సొంతం. అంతకుముందు ఈ రికార్డు ఉన్న చిన్నారి మూడు గంటలకుపైగా సమయం తీసుకుందని ఇండియన్ క్యూబ్ అసోసియేషన్ పేర్కొంది. దీనినిబట్టి దివిష తెలివితేటల్ని మనం అంచనా వేయవచ్చు. దివిష తల్లిదండ్రులు ఆరతి భన్సాల్, విశాల్ భన్సాల్. తనకు కూడా చిన్నప్పటి నుంచి క్యూబ్ పట్ల ఆసక్తి ఉందని, అందుకే పాపను చిన్నప్పటి నుంచి చురుగ్గా తయారుచేశానని ఆరతి చెబుతారు. దివిషకు రెండేండ్లప్పటి నుంచే క్యూబ్ ఎలా పరిష్కరించాలో చెప్పటం ప్రారంభించానని ఆమె పేర్కొన్నారు. కేవలం 40 రోజుల్లోనే తనకు ఒడుపు పట్టుబడిందని అన్నారు. క్యూబ్‌ను పరిష్కరించటం అంత సులభమైన అంశం కాదని, ఇందులో దాదాపు 20 రకాల గణితశాస్త్ర సూత్రాలను అనుసరించవలసి ఉంటుందని దివిష తండ్రి విశాల్ వివరించారు. ''దానిని ఐదు నిమిషాల్లో పూర్తిచేయటం అనేది సాధారణ అంశం కాదు. మా పాపను చూసి గర్వపడుతున్నా'' అంటారు విశాల్.